

వేట

రెడీమేనా అప్పన్నా, అన్నాడు అప్పారావు.

రెడీయండి.

సిగరెట్లు పట్టుకున్నావా ?

ఆహా.

అయిడియాలూ, వంకలూ ఏ మాత్రం వున్నట్టు?

నా దగ్గిర డజనున్నాయండి. మా యాడదానికి పురుడు, అత్తగారి పాణగండం, మీ తమ్ముడిగారికి పరీక్ష ఫీజు, మేష్టారిల్లు వేలం, మీ బాబాయిగారి ప్రమోషనుకి అర్జెంటుగా లంచం, రెండు టెలిగ్రాపులు, టెలిగ్రాపులాంటి ఉత్తరాలు రెండు, కోపరిటివు లోను మంజూరు కాయితం....

సర్సర్లె. అప్పివ్వనన్న వాళ్ళకి ఎదురిచ్చి మొహం మాడ్చెయ్యడాని కే మాత్రం జాగర్తెశావు....ఎంతా? ఎనిమిది రూపాయలా——ఇలా తే. పావలాలుగా మార్చి నీకు సగమిస్తాను. ఎలాటివాడేనా సరే, "నేనే నిన్నడగడానికి వస్తున్నా బాబోయ్" అని ఎంతలేసి ఒట్లూ సత్యాలూ పెట్టినాసరే. ఒక్కపావలా, మహా అయితే రెండు ఇయ్యి. దాటావంటే చంపేస్తా. బయల్దేరు. పదిగజాల వెనుక నేనొస్తా. మళ్ళీ కిళ్ళీ బడ్డీ దగ్గరే కలుసుకోడం. ఒకవేళ అప్పులాళ్ళెవరైనా ఎదురైతే తొరగా వొదిలించుకురాస్మీ" అన్నాడు అప్పారావు.

* * *

ఇద్దరూ బాకీ చెల్లింపు గడువులా కొత్త అటూ ఇటూగా బయల్దేరారు జనారణ్యంలోకి. లోభత్వం, పరమ లోభత్వం, చీకటిలా అలుముకుంది. కన్ను పొడుచుకున్నా ఎక్కడా ఒక అప్పు కనబడడంలేదు. సంపాదించే దారికూడా స్పష్టంగా తెలీటంలేదు. అప్పులాళ్ళ నిజరూపాల్లా దారికిటూ అటూ మర్రిచెట్లు జుట్లు విరబోసుకుని వికృతంగా కనిపిస్తున్నాయి. అప్పులవాళ్ళ "తే తే తే తే" కేకలు ఇలకోళ్ళలా కీచు పెడుతున్నాయి. అప్పన్నకీ అప్పారావుకీ గుండె దడదడ కొట్టుకుంటూంది.

ఏ మనుషులో ఏ కాబూలీ పీనుగున్నాడో ఎరగముగదా. కాని ఆ మనుషుల్లోనే అప్పులిచ్చే కొత్తవాళ్లూ దొరుకుతారు. అంతా ఈశ్వరుడి లీల. గులాబీ పువ్వు చుట్టూ ముళ్ళు పెట్టాడు. అప్పులిచ్చే మంచివాళ్ళన్న

లోకంలోనే "ఇచ్చిన అప్పు తీర్చమనే" వాళ్ళని కూడా తిరగనిస్తున్నాడు. కాని వాళ్ళ వల్లా కొంత ఉపయోగం ఉంది. అసలు కొరమాలిన వస్తువు లేదు సృష్టిలో: ఉంటే గింటే దృష్టిలోనే తప్ప బాకీ అడిగే దుర్మార్గుడు కూడా ఒకందుకు పనికొస్తాడు. ఇప్పుడు తమని బాకీ తీర్చమని వేదించే ఒక దుష్టుడు ఋణదరాజుగారికి బాకీ! వాడు అయన్నుంచి తప్పించుకోలేక తిరుగుతున్నాడు. అయినా ఇటూ తనని తీరికవేళ్ళల్లో వేపుకు తింటూనే ఉన్నాడు. మానవుడిలో అజ్ఞాన దీపం అంటే ఇదే. త్వమే వాహం అన్న విలువైన ముక్క తెలుసుకుంటే ఇన్ని బాధలుండవు. ఏం చేస్తాం. వాళ్ళ ఖర్మ.

ఇప్పుడు ఋణదరాజుగారి దగ్గర అప్పారావు అప్పు వేటాడాలి. రెండుసార్లు అడగబోయి పుచ్చేసుకున్నంత పని జరిగిందిగాని అంత లోనే ఆయన పసిగట్టి పనుందని చెప్పి దుప్పిలా పారిపోయాడు. ఇవాళ చచ్చినట్టు దొరుకుతాడు. ఆయనకు బాకీపడి తప్పుకు తిరుగుతున్న వాడు పది గంటలవేళ ఫలానా చోట దొరుకుతాడని అప్పారావు ఆయనకు ఉప్పం దించాడు అప్పన్న తమ్ముడి ద్వారా. ఇవాళ ఋణదరాజుగారు అమ్మవారి గుడిదగ్గిర కొస్తాడు! ఎదురుగుండా ఇంటి అరుగుమీదనే ఆయనక్కావల సినవాడు కనబడతాడు. అప్పుడు ఈయన వెంటనే వాడిమీదకి లంఘించి...

* * *

అప్పారావు అమ్మవారి కోవెలకి ఇసింటాఉన్న కిళ్ళీబడ్డీ చేరుకునే సరికి అప్పన్న ఇంకా రాలేదు. వేళై పోతోంది. రెండుసిగరెట్లు తగలడ్డాయి. టైము వేస్టనుకున్నాడు అప్పారావు. ఇదే ఇంకో పీది అయితే ఈ పాటికి పదో పరకో దొరికేదేమో....

అప్పన్న కొన ఊపిరితో, జీవచ్ఛవంలా, అప్పుడే అప్పులవాడి బారినుండి తప్పించుకున్న నిర్ధనుడిలా వచ్చాడు.

అప్పు తప్పి రూపాయి లొట్టోయిందండి. ఇద్దరు తగులుకున్నారు దార్లో. సెట్టి దులిపేశాడు. ఒళ్ళు సచ్చి పోయిందండి అన్నాడు అప్పన్న ఉసూరుమంటూ.

అప్పారావు జాలిగా నవ్వాడు. "అందుకే చదువుకొమ్మన్నాను. విన్నావా. చదువుకుంటే పులికథ తెలిసేది" అన్నాడు.

అప్పన్న అడక్కపోయినా పులికథ చెప్పేశాడు. పెద్దపులికి, ఒక ఆవు పెద్ద మొత్తం బకాయి పడింది. శాన్నాళ్ళు మొహం మాటుచేసుకు తిరిగినా ఒకనాడు కొమ్ముకి వందరూపాయల నోటు తగిలించుకుని మరీ దొరికిపోయింది. పులి మింగేస్తానంది. ఇదిగో ఈ వందరూపాయలనోటు మార్చి-అక్కడో చిన్న బాకీ తీర్చి- పాపం వాళ్ళు పిల్లలవాళ్ళు - మిగతా చిల్లర తొంభయీ పట్టుకొచ్చి నీ కిస్తానంది ఆవు. ఏ కంటనుందో పులి దాని మాట నమ్మి వదిలింది. తీరా అది నాలిక్కరుచుకునేలోగానే ఆవు తిరిగొచ్చి తొంభై రూపాయలు తీసి దాని మొహాన కొట్టింది. పులి తెల్లబోయి ఏడిచేసి బాకీ మాఫీ చేసేసింది.

"ఈ ఆవు కథ ధర్మమా అని నేనెన్నోసార్లు తప్పించుకున్నాను. తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నాడు అప్పారావు.

అప్పన్న నమ్మలేదు. ఎంత గోవైనా మరీ అంత చవకరకం ఉంటుందా విడ్డూరం కాకపోతే అన్నాడు. ఉన్నదంతా బాకీగా తీర్చెయ్యడం ఎలాటి వాజమ్మా చెయ్యదన్నాడు.

అప్పారావు నవ్వాడు. "అదీ బాకీ తీర్చడం కాదోయ్ వాజమ్మా. బాకీ యేవిటి వెధవది టిప్ ఇచ్చినా ఇవ్వొచ్చు. పులేవిటి! ఆవును పట్టుకు మళ్ళీ వదల్డం ఏవిటి : అలాటి మహోజ్వల అవకాశాన్ని కాపిటలైజ్ చేసుకోని గోవుంటుందా. పరమ లోభికి చెప్పినా, ఈ సంగతి వినగానే వందో యాభయ్యో పారేసి అపదకి అడ్డుపడతాడే.

"కథలో ఆవు ఏ నాలుగొందలో అప్పు చేసుంటుందనీ ఆనందంలో ఉక్కిరిబిక్కిరై పోయి కృతజ్ఞతకొద్దీ పెద్దపులి బాకీ తీర్చి పారేసుంటుందనీ నా థీసిస్" అన్నాడు.

దూరంగా నల్లకోటు కనబడింది. ఋణదరాజుగా రొస్తున్నాడు అన్నాడు అప్పన్న. రెండు నిముషాలసేపు ఇద్దరూ ఊపిరి బిగబట్టి పొంచి కూచున్నారు. గుండెలు దడదడ ట్టుకున్నాయి అప్పు దొరకబోయే వాడి గుండెల్లా. నువ్విట్నించిలా వెళ్ళి ఆపెదుర్రా. నేను పలకరించి ఆపలేక పోతే నువ్వు కాయొచ్చు అన్నాడు అప్పారావు. కాని అంతలో నల్లకోటు బాగా అల్లంత దూరంలోనే ఆగిపోయి ఒక తలపాగాతో మాటాడుతూ నిలబడి పోయింది.

నడిరోడ్డుమీద కూడా కల్లబ్బులు పెట్టేసి మాటాడితే ఎలా. ఎన్ని లోన్ అవర్స్ వేస్టు అని విసుక్కున్నాడు అప్పారావు.

"కొంపదీసి మన్లాటివాడే— ఏ అప్పల్సాఁవోఁ అడ్డుతలిగి అక్కడే అప్పు కొట్టేయటం లేదుగదా" అన్నాడు అప్పన్న.

అప్పారావు గుండె గుభేలుమంది. తలపాగా శాస్త్రీ అప్పుల్సామి కాదని తెల్సుకున్నమీదట కుదుట పడింది. ధైర్యంగా నవ్వాడు.

"వాడు కాదులేవోయ్-వీడెవడో సాదారకం. వాగుడుకాయ. గంటల కొద్దీ వాగుతారు వీళ్ళు. చర్చిస్తారు. ఉపన్యాసాలిస్తారు, అంతా పొల్లే. అప్పు గురించి ఒక్కముక్క మాటాడరు. వాళ్ళమొహం.... అప్పల్సావైతే ఇంత సేపా" అన్నాడు.

వాడు ఇవతలవాళ్ళ అవసరాలుకూడా గమనించడు. రెండు మూడు సార్లు అప్పారావు ఇద్దరు ముగ్గుర్ని మెల్లిగా మాలీసు చేసి, దువ్వి వాళ్ళ దగ్గిర అప్పు అందుకోబోతూండగా వాళ్ళు సరిగా నోట్లు తీసి ఇస్తున్న

ముహూర్తంలో అప్పల్స్వామి ఎక్కణ్ణించో డేగలా వచ్చి వాలి భోరున ఏడిచేసి ఫళ్ళున నవ్వేసి కూచిపూడి డాన్సు ఆడేసి, అకాడమీ వాళ్ళు ఒడిస్సీనీ, కథకళినీ గుర్తించి డబ్బిచ్చారుగాని దీనికివ్వలేదని చెప్పి, ఆ డబ్బు కాస్తా పుచ్చుకు చెక్కేశాడు. శ్రమ తనదీ, ఫలం వాడిదీ అయిపోయింది. ఇలా నీతి నియమం లేకుండా చెలరేగడం బాగులేదని అప్పుడతన్ని యూనియన్‌లో పెట్టి కడిగేశాడు అప్పారావు.

పూర్వం ఇలాటివుండేవికాదు. ఒక్కొక్క పరగణా ఒక్కొక్క అప్పురాయల అధీనంలో వుండేది. వాడి అనుమతి లేందే, ఇరుగు పొరుగు పరగణాలవాళ్ళు ఇందులో జొరబడి అప్పులు నొల్లుకు పోయిందికి వీలుండేది కాదు. అవసరమై అడిగితే, ఆ పరగణా పాలకుడు ఉదారంగా హక్కులు దానం చేసేవాడు; లేదా కప్పంకట్టే పద్ధతిమీద కౌలుకిచ్చేవాడు.

"ఆ తరంవారిలో అప్పురాయలవారు ఎంత గొప్పవారనీ: నువ్వా కథ విన్లేదు కాబోలు" అన్నాడు అప్పారావు.

అప్పురాయలు 18 పరగణాల ఏలిక. అంత సూక్ష్మబుద్ధి, వాక్పటిమ, సమయస్ఫూర్తి, ఋణ పారీణత ఈనాడు అప్పుకి కూడా దొరకవు. తన 18 పరగణాలలో తనకే కాక ఇతరులక్కూడా దొరకనంత కూలంకషంగా అప్పులు చేశాడు ఆయన. పరమ ఋణాళువు. ఒకమాటు అప్పు కవిగారు అపదలో ఉండి ఆయన కొలువుకు వెళ్ళాడు అప్పు కోసం. అప్పుకవి మహా ఋణవంతుడు-పండితుడు. ఋణ ఋగ్వేది. ఋణవ్యాకరణ, ఋణతర్క మీమాంసాది శాస్త్రనిధి. అప్పుకవీయ గ్రంథకర్త

"ఋణగ్రహణ గణాధిపా! అప్పురాయాస్థీ! ఈ భూమ్మీద నీ అప్పులే సెలయేళ్ళై, నదులై. మహానదులై ప్రవహించి సముద్రాలయాయి. భూగోళంలో "అప్పు"లన్నీ (అనగా నీళ్ళు) నీవే. అప్పులన్నిటినీ ఆపోశనం పట్టిన అగస్త్యుడివి నీవే" అన్నాడు.

అప్పురాయలు మొహం తిప్పుకున్నాడు.

అప్పుకవి చిన్నబుచ్చుకున్నాడు తన ఋణవాక్యం రాయలవారికి దా-ఋణంగా నచ్చలేదని.

"హే ఋణాబ్ధీ! నీ ఋణజలధిలో అప్పులకోసం తిరుగుతూ బతికే భవత్క-ఋణోప జీవులమే మేమంతా" అన్నాడు. అప్పురాయలు మొహం రెండోవేపుకు తిప్పుకున్నాడు.

"ఋణసామ్రాట్! నువ్వు అందరి దగ్గర అప్పుతీసుకుంటావనీ తీర్చవనీ అంటారుగాని, అందరూ ఋణగ్రహణ శిల్పంలో నీకు ఎంతో ఋణపడి ఉన్నారు. తీర్చాలన్నా తీర్చలేరు." అన్నాడు అప్పుకవి.

అప్పురాయలు వెనక్కి తిరిగి కూర్చున్నాడు.

అప్పుకవికి నిరాశ కలిగింది. తన అప్పరసజ్ఞత కొరగానిదయి పోయిందనీ నొచ్చుకున్నాడు. తుది ప్రయత్నంగా మరొక్క మాట అన్నాడు.

"కఋణాపయోనిధీ! అప్పులు అడిగేవేళ నువ్వు ఆడిన సరసాలన్నీ మనోహరమైన రూపాలు ధరించి అందమైన కన్యలుగా స్వర్గంలో విహరిస్తున్నాయి. వారినే అప్సరసలంటారు" (అప్సరసాలన్నమాట భ్రష్టమై ఈ పేరు వచ్చింది) అన్నాడు.

వెంటనే అప్పురాయలు సింహాసనం మీంచి లేచి దిగి అప్పుకవి వేపు బయల్దేరాడు.

కొంపదీసి తంతాడా ఏమిటి చెప్మా అని అప్పుకవి శంకించాడు. గాని ఆవరకే అప్పురాయలు వచ్చేసి ఆయనను గాఢాలింగనం చేసుకున్నాడు.

"మహాకవీ, మీ మహా కావ్యాలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. నేను

గద్దె దిగిపోయి, మొహం తిప్పినపుడల్లా ఆ దిశనున్న పరగణాలు మీకిస్తూ వచ్చాను. ఇపుడు నాలుగు దిక్కులూ మీవే...దిక్కున్నచోట అప్పు తెచ్చుకోండి. దిక్కేమిటి నా రాజ్యం అంతా మీదే. ఈ రాజ్యంలో మీ చిత్తం వచ్చినవారిని, ఓపినంత అప్పు అడిగి పుచ్చుకోవచ్చు. ఆ హక్కులు దారాదత్తం చేస్తున్నాను. వాటితోపాటు నా పాత బాకీలు కూడా మీవే. అంతేకాదు. ఇహనుండి మీరే నాకు అప్పులు ఇవ్వాలి. లేకపోతే తెచ్చి ఇవ్వాలి. ముందో రెండు పుంజీల వరహాలివ్వండి" అంటూ ఆయనను అభినందించి సత్కరించాడు అప్పరాయలు.

* * *

"ఆహా! నాటి విశాల హృదయాలు, ఆ ఔదార్యాలూ, ఆ అప్ప రసజ్ఞత ఏవి - అప్పన్నా - ఏవీ?" అన్నాడు అప్పారావు కథలోనించి గాఢంగా నిట్టూరుస్తూ.

"కతలకేంగాని ముందర పన్జూడండి. ఇపుడు రాజుగారు ఇటే వొచ్చినా తిన్నగా అప్పుల్నరసయ్య కోసం ఎదిరింటి కెళిపోతాడు గదా. మనవెలా ఆపడం. ఆపి అడిగినా, ఆలోగా అప్పుల్నరసయ్య మన్నిచూచి తగులుకుంటే ఎలా?" అన్నాడు అప్పన్న.

అప్పారావు జాలిగా నవ్వాడు. "నీకు స్ట్రాటజీ తెలీలేదోయ్ అప్పన్నా. అప్పుల్నరసయ్యున్నది బాకీరావుగారి అరుగుమీదగదా.... బాకీ రావుగారికీ మన రాజుగారికీ చూడగానే కౌగలించుకునే అలవాటు లేదు. అప్పో బాకీయో తేలని మొత్తం ఒకటి వాళ్ళిద్దరిమధ్యా నలుగుతోంది. అంచేత రాజుగారు దూకుడుగా వచ్చినా, అరుగుమీద బాకీరావుని చూచి

తగ్గి తమాయించుకుని అప్పల నరసయ్యకోసం వోటెయ్యడానికి వెనక్కి వెనక్కి నడుస్తూ ఈ కిళ్ళీబడ్డీ దగ్గరికే వస్తాడు మనం ఇక్కడ మాటేశా మని తెలీక. వెంటనే మనం వేటాడేస్తాం. ఆంథాస్లిప్పిట్ సెకండ్ ఆపరేషన్ మోడర్న్ అపాలజీ" అన్నాడు అప్పారావు నీరసంగా నవ్వుతూ.

దూరంగా నల్లకోటు. అందులో ఋణదరాజుగారు కదలడం జరిగింది. అప్పారావూ అప్పన్నా బడ్డీచాటుకు జరిగి కాసేపు రాజుగారికేసి కాసేపు ఎదురింటి అరుగుమీది ఎరకేసి చూస్తున్నారు. లోకంలో గడియారాలన్నీ ఆగిపోయాయి. అప్పారావు గుండెలోదే దెశ అసేవకుగాను థాటీగా కొట్టుకుంటోంది.

ఋణదరాజుగారు ఈలపాట తక్కువచేసి మంచి హుషారుగా వచ్చేస్తున్నాడు. అప్పల్నరసయ్యని కళ్ళారా చూడాలని ఎన్నాళ్ళనించో ఆయన హృదయం తహతహలాడి పోతోంది. ఇవాళ మంచి మంచి అవకాశాలు కలిసొచ్చాయి. ఇందాక, 'దగ్గిర్నావచ్చి—ఆపేదాకా—గుర్తు తెలీకుండా—తలపాగా చుట్టుకు—మారువేషంలో — మీదపడ్డ అప్పల సామి గాడిది మినహా. వెధవపీనుగ చూస్తూండగా పాతిక రూపాయలు పట్టుకుపోయాడు అరగంటలో ఇస్తానని...

ఋణదరాజుగారు కిళ్ళీబడ్డీ దాటుతూ వుండగా అప్పన్న కంగారు కొద్దీ ఆయన ఎదటపడి అటకాయించేయ బోయాడుగాని అప్పారావు సకాలంలో అతన్ని ఆపాడు. లాకాయ లూకాయ దెబ్బతగిల్తే, కథ అడ్డం తిరుగుతుంది. దెబ్బతిన్న పులిని ఆకట్టడం కష్టం-ఓపిక కావాలి. నిగ్రహం వుండాలి...

రాజుగారు కోవెలదాక దాటీగావెళ్ళి కొయ్యబారిపోయారు. అలా నిలబడి పోవడం లాభసాటిగాదని మళ్ళీకోలుకొని బాకీలరావుని శపించి నెమ్మదిగా వెనక్కి వెనక్కి అడుగువేసి కిళ్ళీబడ్డీ చేరేవరకూ —

దండాలు బాబయ్యా....దండాలు. ఛీ వెధవా నువ్వా. నా దగ్గి...మా బుల్లి కొంట్లో....బాగు...రేం....లేదు....అది కాదు బా...బోయ్ నువ్వెక్కడ దాపురించావు...అనే బుణగుణ ధ్వని "ఒరేయ్ అప్పన్నా నీకేం బుద్ధిలేదూ" అన్న అప్పారావు కేకతో సర్దుకున్నాయి.

నమస్కారం రాజుగారూ అన్నాడు అప్పారావు.

నమస్కారం అన్నాడు రాజుగారు నీరసంగా.

"ఈ వెధవకి సమయం సందర్భం నుంచీ మర్యాదా తెలీవండి. అనెడ్యుకేటెడ్ బ్రూట్" అన్నాడు అప్పారావు.

"వెధవ్వేషాలు కుదరవు. నాదగ్గి రొండకాదు రెండొందలు కూడా లేదు" అన్నారు రాజుగారు కంగారుగా.

అప్పారావు షోగ్గా వయ్యారంగా వెనక్కి తిరిగి తన వెన కెవరో ఉన్నారన్నట్టు చూశాడు. ఇటు తిరిగి నవ్వాడు. "యూమీన్ మీ... నా వెనకెవరో ఉన్నారనీ వారిని మందలిస్తున్నారనీ అనుకున్నాను—" అన్నాడు.

రాజుగారు ధుమధుమలాడుతూ ఎదురింటివేపు చూస్తున్నారు. కంగారుగా అటూ ఇటూ చూస్తున్నారు.

"డుయూనో! మీకు తెలిసా? విన్నారా" అన్నాడు అప్పారావు.

రాజుగారు అనుమానంగా వెనక్కి చూశారు.

"మీరు క్షణంక్రితం అద్భుతమైన హాస్యపు మాటన్నారు. వన్నాఫ్ది ఫైనెస్ట్ జోక్సు ఎవర్. నేనే అయితే అది రాసుకొని ఎలక్షన్ ప్రొపగాండాలో వాడేద్దును" అన్నాడు అప్పారావు.

"ఈ శషభిషలు కుదరవు.... నాకు టైమైంది పోతున్నాను" అన్నారు రాజుగారు దశదిశలా కంగారుగా చూస్తూ.

"ఐనో ఐనో. టైము చాలా విలువైనది. ఇపుడు మీరు ఆ వందా ఇచ్చి మాటదక్కిస్తే అది ఓ ప్రాణాన్ని— ఒకటేమిటి రెండింటినీ కాపాడుతుంది— ఆ రెండూ పెళ్ళాడి ఇంకోపిల్ల ప్రాణాన్ని పెడతాయి. అదేమో లక్షలార్జించి— వివరాలెందుకులెండి ట్రూతీజ్ స్ట్రేంజర్ దాన్ ఫిక్షన్. నేన్నిజం చెప్పినా మీరు నమ్మరు."

రాజుగారు మళ్ళీ వీధి చివరకి తొంగిచూస్తూ "నా దగ్గిర డబ్బు లేదు" అన్నారు.

"డబ్బు దేవుందండి కుక్కిస్తే రాల్తుంది. మీరు ఊ అంటే దేన్నో తందాం."

"అసలేన్నెందు కివ్వాలయ్యా మీ అందరికీ" అన్నాడు రాజుగారు కోపంగా.

"అప్పన్నా చెప్పరా" అన్నాడు అప్పారావు.

అప్పన్న సంచీలోంచి సరంజామా తీశాడు.

"చిత్తం మా ఇద్దరితాలూకు బంధువుల్లోను నిన్న సాయంత్రం వరకు ఇద్దరో ముగ్గురో పోయారండి. ఈపాటి కింకో ఇద్దరు పోయుంటారు. ఇంకిద్దరో ముగ్గురికో ప్రాణంమీదకొచ్చింది. ఇవిగో టెలిగ్రాములు. ఇవిగో ఈ రెండూ ఉత్తరాల్లా వున్నాయేగాని ఇవీ టెలిగ్రాముల్లాటివే. మేష్టార్లిలు వేలం వేస్తున్నారు. అప్పారావు గారి తమ్ముడు పరీక్షకి ఫీజు ...రిక్షావాని బీదబాలికకు మందు..." అంటూ చెప్పుకుపోతున్న అప్పన్న అప్పారావు గావుకేకవిని, తరువాత చుట్టూ చూసి కెవ్వుమన్నాడు.

అప్పారావు గావుకేక పెట్టడం నిజమే.

అప్పారావునీ అప్పన్ననీ కలుసుకోవాలనీ, వాళ్ళిద్దరిచేత కొన్ని ఋణపత్రాలమీదా సమస్లమీదా ఆటోగ్రాపులు పెట్టించుకోవాలని చాలా

కాలంగా సరదాపడుతున్న అభిమానులు కొందరు హఠాత్తుగా నేలలోంచి మొలిచినట్టుగా అక్కడ సంభవించి వారిని చుట్టుముట్టడించారు. వారంతా ఋణదరాజుగారిని ఆశ్రయించగా ఆయన కనికరించి ఈ భేటీ ఏర్పాటుకు ఈ విధంగా దోహదం చేశాడు.

ఎంతో ఆప్యాయంగా తమ తమ శిల్ప సంప్రదాయాల ప్రకారం లొట్టలువేస్తూ ఎరని చూస్తున్న, పులిని చూస్తున్న, వేటగాణ్ణి చూస్తున్న ఎరనీ పులినీ వేటగాణ్ణీ చూస్తున్న, పులిని చూస్తున్న, వేటగాణ్ని చూస్తున్న ఎరని మేస్తున్న, పులిని కాస్తున్న... ఆ యొక్క సన్నివేశం నేత్రానందంగా మహోజ్వలంగా ఉంది. అయినప్పటికీ సమావేశకర్త ఋణదరాజుగారు ఎందుకో హఠాత్తుగా కదిలి, తీవిగురించి లేనిపోని పట్టింపులు పెట్టుకోకుండా సభవారి కృతజ్ఞతాభివందనాలు అందుకోకుండా రివాజైన దానికన్న ఎక్కువ వేగంతో బయల్దేరి వెళ్ళిపోయారు. అక్కడి సభవారు చాలామంది, అయ్యో మహోపకారి వెళ్ళిపోతున్నాడేల అని తెల్లబోయి చూడసాగారు.

వెనకాలవేపునుంచి బాకీరావుగారు ఉత్సాహంతో ఋణదరాజుగారి కోసం వస్తున్నవైనం వీరు గమనించలేదు. ఆ సంరంభంలో తమకు ప్రముఖపాత్ర లేదని తలచి చిన్నబుచ్చుకున్న అప్పారావు గల్లంతై పోవడంకూడా వారు గమనించలేదు.

"హే ఋణవాన్! ఏది ఎర? ఏది పులి? ఏది గురి, ఏది బలి! అంతా నీ లీల" అనుకున్నాడు స్వామి ఋణానంద— తాను ఎంతో ఆశతో ప్రేమతో దరిచేరబోయిన ఆ మహాసభ, తనని చూడగానే వందన సమర్పణ లేకుండా ముగింపు చెందడం, జనం కకావికలై పరుగులెత్తడం చూసి.

●